క్లుప్తంగా

ఘనంగా సెమీక్రిస్మస్ వేడుకలు

నడిగూడెం : మండల పరిధిలోని సిరిపురం గ్రామంలో ఆదివారం సెమీక్రిస్మస్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం పాస్టర్ కె.సురేష్ సందేశాన్ని బోధించారు. కార్యక్రమంలో రాజకుమార్, నగేష్, అబ్రహాం, క్రైస్తవులు తదితరులు పాల్గొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో పూరిగుడిసె దగ్ధం


పూరిగుడిసెలో దగ్ధమైన సామగ్రి

గరిడేపల్లి : షార్ట్ సర్క్యూట్‌తో పూరిగుడిసె దగ్ధమైన సంఘటన మండల పరిధిలోని రాయినిగూడెంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మల్లెంపల్లి గుర్వయ్యకు చెందిన పూరిగుడిసెలో ప్రమాదవశాత్తు షార్ట్‌సర్క్యూట్ జరిగి దగ్ధమైంది. సమాచారం మేరకు ఫైర్ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకునేలోపు గుడిసెలోని నగదు, టీవీ, దుస్తులు, వస్తువులు కాలిబూడిదయ్యాయి. సుమారు రూ.లక్ష 50వేల ఆస్తినష్టం జగినట్లు ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు వాపోయాడు.

సోమప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు


పూజలు నిర్వహిస్తున్న భక్తులు

నేరేడుచర్ల : మండలంలోని బురుగులతండా గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న సోమప్ప దేవాలయంలో కార్తీక త్రయోదశీ సందర్భంగా ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు ఇరుగంటి శ్రీనివాసచార్యులు ఆధ్వర్యంలో అభిషేకాలు, పూజలను నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌రావు, భక్తులు నటరాజ్, శివ, శ్రీనివాస్‌రావు, వెంకట్రావ్ తదితరులున్నారు.

ఓడినా ప్రజల కోసం పనిచేస్తా : సైదిరెడ్డి

హుజూర్‌నగర్ : ఎన్నికల్లో ఓడినా ప్రజల కోసం పని చేస్తూనే ఉంటానని మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గ ప్రజల తీర్పును గౌరవిస్తున్నానని, బీఆర్ఎస్ కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా 24గంటలు అందుబాటులో ఉంటానని ఆయన అన్నారు. సోమవారం హుజూర్‌నగర్‌లో నిర్వహించే బీఆర్ఎస్ నియోజకవర్గ స్థాయి సమావేశానికి హాజరు కానున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశానికి నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తల హాజరుకావాలని కోరారు.

ఉపాధిహామీ పనులపై సోషల్‌ఆడిట్


అవగాహన కల్పిస్తున్న అధికారులు

మఠంపల్లి : మండలంలోని వివిధ గ్రామాల్లో ఉపాధిహామీ పథకంలో 15నెలల పాటు కోట్ల రూపాయలతో చేపట్టిన పనులకు సంబంధించి ఆదివారం జిల్లా రిసోర్స్‌పర్సన్లతో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా మండలంలోని పెదవీడు గ్రామపంచాయతీ ఆవరణలో అధికారులు ముగ్గులతో మ్యాప్ వేసి అవగాహన కల్పించారు. ఈ తనిఖీల్లో భాగంగా 16న మండల కేంద్రంలోని ఎంపీడీఓకార్యాలయంలో ప్రజలు, ప్రజాప్రతినిధుల సమక్షంలో ఓపెన్‌ఫోరం నిర్వహించి గ్రామాల్లో జరిగిన అవకతవకలపై అధికారులు వివరించి చర్యలు తీసుకోనున్నారు. కార్యక్రమంలో జిల్లా రిసోర్స్‌పర్సన్ ప్రసన్నకుమారి, పంచాయతీ కార్యదర్శి లక్ష్మణ్‌నాయక్, ఎఫ్ఏ బిచ్చు నాయక్, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికల్లో దివ్యాంగుల కోట తేల్చాలి

గరిడేపల్లి : తెలంగాణ రాష్ట్రంలో త్వరలో జరగబోయే పంచాయతీ ఎన్నికల్లో దివ్యాంగుల కోట తేల్చేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ముందుకు రావాలని భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేష్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో అంతర్జాతీయ ప్రపంచ వికలాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి మాట్లాడారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ దివ్యాంగులకు ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో ఉచిత రవాణా సౌకర్యం కల్పించడంతో పాటు పెన్షన్ రూ.6వేలు అందజేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కుర్ర గోపియాదవ్, గుర్రం నరేష్‌రెడ్డి, కొల్లూరి ఈదయ్య బాబు, కుర్ర గోపి, నరేష్‌రెడ్డి పాల్గొన్నారు.

యాసంగి సాగుకు సమాయత్తం

- బోర్లు, బావుల కింద ముమ్మరంగా సాగు పనులు
- సాగర్ నీరు రాకపోవడంతో స్వల్పకాలిక పంటలపై రైతుల మొగ్గు
- ఈనెల 15లోగా వరినార్లు పోసుకోవాలని అధికారులు సూచన


నడిగూడెం మండలం బృందావనపురం వద్ద పెరుగుతున్న వరినారు


వేణుగోపాలపురంలో నాట్లువేస్తున్న కూలీలు

నడిగూడెం : యాసంగి సాగుకు రైతులు సమాయత్తం అవుతున్నారు. వానాకాలం పంటలు దాదాపు పూర్తి కావడంతో, ప్రస్తుతం యాసంగి సీజన్ ఆరంభం కావడంతో మండల రైతులు సాగు వైపు దృష్టి సారించారు. సాగర్ నుంచి నీరు రాకపోయినా బోర్లు, బావుల ద్వారానైనా సాగు చేయాలని వరినార్లు పోసుకోవడంతో పాటు నాట్ల పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. గత వానాకాలం కంటే కొంత మేర కోదాడ డివిజన్‌లో వరి సాగు తగ్గుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

తప్పని సాగునీటి కష్టాలు..

శ్రీశైలం, సాగర్ జలాశయాలకు వరద లేకపోవడం, నిల్వలు చాలా తక్కువగా ఉండడంతో ఈ సారి రైతులకు సాగునీటి కష్టాలు తప్పేలా లేవు. అయినప్పటికీ కోదాడ డివిజన్ పరిధిలోని నడిగూడెం, మునగాల, మోతె, అనంతగిరి, కోదాడ, చిలుకూరు మండలాల్లోని పలు గ్రామాల్లో చెరువుల కింద నాట్లు ప్రారంభించగా, వ్యవసాయ బోరు, బావుల కింద చాలా చోట్ల ఇప్పటికే నాట్లు వేసేందుకు దుక్కులు దున్నుతున్నారు. మరోవైపు నాట్లు కూడా వేస్తున్నారు. తక్కువ పంట కాలం ఉన్న 90రోజుల నుంచి 120రోజులకే పంట చేతికొచ్చే రకాలను సాగు చేయడంతో మంచి జరుగుతుందని అధికారులు సూచిస్తున్నారు.

తగ్గనున్న వరిసాగు..

కోదాడ డివిజన్‌లో గతంలో దాదాపు 50వేల ఎకరాల్లో వానాకాలంలో వరి సాగు చేస్తే, ప్రస్తుత యాసంగి సీజన్‌లో సాగు తగ్గే అవకాశముంది. ఈ ఏడాది సకాలంలో వర్షాలు కురవకపోవడంతో భూగర్భజలాలు అడుగంటడంతో నీటి కొరత సమస్యతో యాసంగిలో పెద్ద ఎత్తున సాగు చేయడానికి రైతులు వెనుకంజ వేస్తున్నారు. నడిగూడెం, మునగాల, మోతె, అనంతగిరి, కోదాడ, చిలుకూరు మండలాలలో అనుకున్నంతగా యాసంగిలో సాగు ఉండకపోవచ్చని వ్యవసాయాధికారులు అంచనాలు వేస్తున్నారు. కానీ చాలా చోట్ల మాత్రం బోర్ల కింద సాగుకు సమాయత్తం అవుతున్నారు.

బావుల పూడిక పనులు..

యాసంగి సీజన్ సాగుకు నీటి సమస్య ఏర్పడకుండా మండల పరిధిలోని నారాయణపురం, కాగిత రామచంద్రాపురం, కరివిరాల, వేణుగోపాలపురం, చెన్నకేశ్వాపురం తదితర గ్రామాల్లోని రైతులు పాత కాలం నాటి బావుల్లో పూడిక తీత పనులు చేసుకుంటున్నారు. దీంతో భూగర్భజలాల వస్తాయనే ఆశతో పూడికలు తీయిస్తున్నారు.

తక్కువ పంటకాలం రకాలకే మొగ్గు..

యాసంగిలో సైతం అతి తక్కువ పంట కాలం ఉన్న వంగడాలను సాగు చేయడానికే రైతులు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. ఈనెల 15నాటికి నాట్లు పూర్తయితే మార్చి 15నాటికి పంట చేతికొస్తుంది. తద్వారా తుపాన్లు, వడగళ్ల వానలు ఈదురుగాలుల ప్రమాదం నుంచి పంటలను కాపాడుకోవచ్చు, 20వ తేదీలోగా నాట్లు వేసుకోవడానికి వీలవుతుందని అధికారులు చెబుతున్నారు. ముందుగా నాట్లు వేయడంతో ఎండల తీవ్రతకు నీటి సమస్య తగ్గిపోతుంది.

నాలుగు ఎకరాల సాగుకు నారు పోశాను



నాకున్న నాలుగు ఎకరాల సాగుకు బోరు, బావి కింద నారుపోశాను. ఈ ఏడాది వర్షాభావం ఉండడంతో సాగు నీటి సమస్య ఏర్పడింది. నారు పెరిగిన అనంతరం నాటు పెట్టేందుకు, మార్చి నాటికి పంట చేతికొచ్చేలా సాగుకు సిద్ధపడుతున్నాను.

– మొక్క శ్రీను, రైతు, సిరిపురం

సాగర్ నీటిని విడుదల చేస్తే బాగుండు



ప్రస్తుతం యాసంగిలో వరిసాగుకు పనులు చేపట్టాం. భూగర్భ జలాలను బట్టి సాగు చేయనున్నాము. ప్రధానంగా సాగర్ నీటిని విడుదల చేస్తే బాగుంటుంది. గత వానాకాలం సీజన్ కష్టకష్టంగా సాగింది. ఇప్పడైనా అధికారులు స్పందించి నీటి కొరత సమస్యను పరిష్కరించాలి.

– మారిశెట్టి నర్సింహారావు, రైతు, రామాపురం

నెలాఖరు వరకు నార్లు పోసుకోవచ్చు



యాసంగిలో సాగు చేయాలనుకునే రైతులు ఈనెల చివరి తేదీలోగా తక్కువ పంట కాలంలో ఉన్న వాటిని ఎంపిక చేసుకొని, నార్లు పోసుకోవచ్చు. మార్చి చివరలో కోతలు కోసే విధంగా రైతులు ప్రణాళికలు రూపొందించుకోవాలి. సాగు నీటి వనరులు ఉంటేనే సాగు చేయాలి.

– ఎం.రాజగోపాలరావు, వ్యవసాయాధికారి, నడిగూడెం

'రాజీవ్ ఆరోగ్యశ్రీ'ని సద్వినియోగం చేసుకోవాలి


రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆర్డీఓ, ప్రజాప్రతినిధులు, అధికారులు

- ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి

హుజూర్‌నగర్ : రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి, అసంక్రమిత వ్యాధుల జిల్లా అధికారి డాక్టర్ కళ్యాణ్‌చక్రవర్తి అన్నారు. ఆదివారం పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రారంభించి, అందుకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడారు. సమాజ ఆరోగ్య బీమా పథకం రాజీవ్ ఆరోగ్యశ్రీ అని అన్నారు. ఈ పథకం ద్వారా ఇప్పటి వరకు ఏడాదికి రూ.5లక్షల వరకు ఉన్న వైద్యసహాయాన్ని ప్రస్తుత ప్రభుత్వం రూ.10లక్షల వరకు పెంచిందన్నారు. ఆహారభద్రత కార్డు కలిగి ఉన్న ప్రతిఒక్కరూ ఈ పథకానికి అర్హులన్నారు. ఈ పథకం ద్వారా 1276రకాల చికిత్సలకు ఏడాది పాటు ఉచితంగా మందులు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గెల్లి అర్చన రవి, ఎంపీపీలు గూడెపు శ్రీనివాస్, పార్వతి, డాక్టర్ కరుణ్‌కుమార్, తహసీల్దార్ నాగార్జునరెడ్డి, జెడ్పీటీసీ జగన్‌నాయక్, ఆయా మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు, పలువురు ప్రజాప్రతినిధులు, స్థానిక కాంగ్రెస్ నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ప్రయాణాన్ని సద్వినియోగం చేసుకోవాలి


హుజూర్‌నగర్ : ఉచిత బస్సు ప్రయాణ ప్రారంభంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

హుజూర్‌నగర్ : కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు కల్పించిన ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గెల్లి అర్చన రవి, ఆర్టీసీ కోదాడ డీఎం శ్రీహర్ష అన్నారు. ఆదివారం పట్టణంలోని కొత్త బస్టాండ్ వద్ద మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణ టికెట్లను అందించి ప్రయాణాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీల్లో భాగంగా ప్రభుత్వం ఏర్పాటైన రెండు రోజుల్లోనే మహాలక్ష్మి పథకం ద్వారా మహిళకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించడం హర్షణీయమన్నారు. మహాలక్ష్మి పథకం ప్రతి మహిళకు వరంగా మారనుందన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి, ఎంపీపీ గూడెపు శ్రీనివాస్, పలువురు ప్రజాప్రతినిధులు, స్థానిక కాంగ్రెస్ నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో విద్యారంగాన్ని పరిరక్షించాలి


మంత్రి ఉత్తమ్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న ప్రతినిధులు

కోదాడ : తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ పాలనలో విద్యారంగం నిర్వీర్యమైందని, కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగాన్ని పరిరక్షించాలని కేజీ టూ పీజీ విద్యాసంస్థల ప్రతినిధులు రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కోరారు. ఆదివారం వారు హైదరాబాద్‌లో ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపి వినతిపత్రం అందించారు. విద్యార్థులు, విద్యాసంస్థల యాజమాన్యాలు తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో ముందున్నారని, గడిచిన 10సంవత్సరాలలో ప్రభుత్వ విధానాలతో గ్రామీణ ప్రాంతాల్లోని విద్యాసంస్థలు 50శాతం మూతపడ్డాయన్నారు. కార్యక్రమంలో గింజల రమణారెడ్డి, టి.విజయభాస్కర్‌రెడ్డి, బి.సూర్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాలధారులకు అన్నదానం

కోదాడరూరల్ : పట్టణ పరిధిలోని హుజూర్‌నగర్ రోడ్‌లో గల గాలి రమేష్‌నాయుడు అయ్యప్ప సన్నిధానంలో మాలధారులకు నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమాన్ని ఆదివారం దాత ఓరుగంటి నారాయణ అతడి కుమారులు ఏర్పాటు చేశారు. ఈ అన్నదాన కార్యక్రమంలో 500మంది మాలధారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు గాలి శ్రీనివాసునాయుడు, గడ్డం సూర్యారెడ్డి, బర్మావత్ సీతరాంసింగ్, నాగరాజు, పవన్, రంగా ఉన్నారు.

కోదాడఅర్బన్ : పట్టణంలో అయ్యప్పస్వామి దేవాలయంలో మాలధారులకు అన్నదానం చేసినట్లు ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు రేపాల ప్రసాదరావు, చల్లా రామ్మూర్తి ఆదివారం తెలిపారు. దాతల సహకారంతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మహిళల ఆర్థిక స్వావలంబనకే ఉచిత ప్రయాణం

- ఎమ్మెల్యే నలమాద పద్మావతిరెడ్డి


కోదాడఅర్బన్ : కోదాడ డిపోలో మహిళలకు ఉచిత బస్సు సర్వీస్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

కోదాడఅర్బన్ : రాష్ట్రంలో మహిళలకు ఆర్థికస్వావలంబన కల్పించేందుకే ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణ సౌకర్యానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కల్పించారని కోదాడ ఎమ్మెల్యే నలమాద పద్మావతిరెడ్డి అన్నారు. ఆదివారం ఆమె ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం కోదాడకు తొలిసారి వచ్చిన సందర్భంగా కోదాడ ఆర్టీసీ డిపోలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో అధికారులు, కాంగ్రెస్ నాయకులు, మహిళా నాయకులు, ప్రయాణికులు పాల్గొన్నారు.

కోదాడలో ఎమ్మెల్యేకు ఘన స్వాగతం

కోదాడ : నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఎన్నికై ప్రమాణస్వీకారం అనంతరం తొలిసారి కోదాడకు వచ్చిన ఎమ్మెల్యే నలమాద పద్మావతిరెడ్డికి ఆదివారం ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్థానిక బైపాస్ నుంచి కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆమె బొడ్రాయి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి మాట్లాడారు. తనను అత్యధిక మెజార్టీతో గెలిపించిన కోదాడ నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కోదాడ ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించి ప్రభుత్వం కల్పించిన రూ.10లక్షల ఆరోగ్య బీమా పథకాన్ని ప్రారంభించారు. పలువురు నేతలు ఆమెను గజమాలలతో సత్కరించారు. కార్యక్రమాల్లో కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ, మున్సిపల్ చైర్‌పర్సన్ వనపర్తి శిరీష, కాంగ్రెస్ నాయకులు మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు, చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, వంగవేటి రామారావు, ఏర్నేనిబాబు, మందలపు కృష్ణకుమారి, పార సీతయ్య, మహబూబ్‌జానీ, కాటం రెడ్డి ప్రసాదరెడ్డి, ఈదుల కృష్ణయ్య, రామినేని శ్రీనివాసరావు, డేగ బాబు, గరిణె శ్రీధర్, బత్తినేని హనుమంతరావు, కొల్లా కోటిరెడ్డి, షాబుద్దీన్, మల్లీశ్వరి, మంగమణి, చందా నిర్మల, సామినేని ప్రమీల, పబ్బా గీత తదితరులు పాల్గొన్నారు.

మునగాలలో ఘనస్వాగతం

మునగాల : ఎమ్మెల్యేగా ఎన్నికై ప్రమాణస్వీకారం అనంతరం తొలిసారిగా కోదాడకు వస్తున్న ఎన్.పద్మావతికి ఆదివారం మండలంలోని మాధవరం శివారులో మండల ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పలువురు కార్యకర్తలు పద్మావతిని పూలమాలలతో ఘనంగా సత్కరించారు. మండలంలోని ఆకుపాములలో దివ్యాంగులు స్వాగతం పలికారు. కార్యక్రమంలో దివ్యాంగుల సంక్షేమం రాష్ట్ర కార్యదర్శి పాలడుగు సత్యనారాయణ, కాంగ్రెస్ నాయకులు పోలంపల్లి వెంకటేశ్వర్లు, పార్టీ సోషల్‌మీడియా కోఆర్డినేటర్ జిల్లేపల్లి గోపి, పోలంపల్లి సైదులు, తాళ్లపాక అర్జున్, బి.దావీదు, పోలంపల్లి వీరేందర్, తాళ్లపాక శ్రీను ఉన్నారు. మాధవరం శివారులో ఎమ్మెల్యే పద్మావతి, మాజీ ఎమ్మెల్యే చందర్‌రావుకు మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించి స్వాగతం పలికారు. వారిలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మాతంగి బసవయ్య, ఎంపీపీ ఎలక బిందు, వైస్ ఎంపీపీ కొలిశెట్టి బుచ్చిపాపయ్య, పార్టీ మండల అధ్యక్షుడు కొప్పుల జైపాల్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

అనంతగిరి : ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం అనంతరం మొదటిసారి కోదాడకు వస్తున్న సందర్భంగా పద్మావతిరెడ్డికి స్వాగతం పలికేందుకు ఆ పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం నాయకులు తరలివెళ్లారు. ఆయన వెంట మండల నాయకులు బుర్ర పుల్లారెడ్డి, బుర్ర నర్సింహారెడ్డి, బాణోతు బాబునాయక్, గుర్రం వెంకటరెడ్డి, గొట్టెముక్కల బాబురావు, భూపతి, సైదులు, వేణు, రవినాయక్ తదితరులు ఉన్నారు.


కోదాడ : రాజీవ్ ఆరోగ్యశ్రీ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే పద్మావతి


మునగాల : మాధవరంలో పద్మావతికి స్వాగతం పలుకుతున్న నాయకులు, మహిళలు

లక్ష బిల్వార్చనకు ఏర్పాట్లు పూర్తి

హుజూర్‌నగర్ : పట్టణంలోని శ్రీ భీమలింగేశ్వర స్వామి దేవాలయంలో కార్తీకమాసంలో చివరి సోమవారాన్ని పురస్కరించుకుని సహస్ర లింగార్చన, లక్షబిల్వార్చనకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ఈఓ కొండా రెడ్డి, చైర్మన్ అమర్ గౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం తెల్లవారుజామున స్వామివారి దర్శనం, లక్ష బిల్వార్చన, సహస్ర లింగార్చన, దీపాలు వెలిగించుకునే వారికి సౌకర్యంగా ఉండేటట్లు దేవాలయ ప్రాంగణాన్ని సిద్ధం చేసినట్లు తెలిపారు. ఆలయంలో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, తదితర ప్రత్యేక పూజలు జరగనున్నట్లు వారు తెలిపారు.

నత్తనడకన భవన నిర్మాణ పనులు

- నిధులున్నా నేటికీ పూర్తికాని గ్రంథాలయ భవన నిర్మాణం
- మొదటి దశలోనే నిలిచిన పనులు
- పూర్తి చేయాలని గ్రామస్తుల డిమాండ్


చిలుకూరులో అసంపూర్తిగా ఉన్న గ్రంథాలయ భవన నిర్మాణ పనులు

చిలుకూరు : మండలానికి మణిహారంగా నిలిచి ఘన చరిత్ర కలిగిన చిలుకూరు బాపూజీ శాఖా గ్రంథాలయం నూతన భవన నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఈ పనులు ప్రారంభించి దాదాపు సంవత్సరం దాటినా నేటికీ అసంపూర్తిగానే మిగిలాయి. భవనం శంకుస్థాపన దగ్గర నుంచి ఈ పనులకు అడ్డంకులే ఎదరవుతున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అయినా గ్రంథాలయ పాలకవర్గం, గ్రామస్తులు పట్టుబట్టి పనులను ప్రారంభించారు. స్థానిక జెడ్పీటీసీ బొలిశెట్టి శిరీషనాగేంద్రబాబు తన జెడ్పీ నిధుల నుంచి రూ.10లక్షలు మంజూరు చేశారు. ఆ నిధులతోనే పనులు ప్రారంభించారు. అనంతరం ప్రభుత్వం నుంచి ఎలాంటి నిధులు రాకపోవడంతో పాలకవర్గం, గ్రామపెద్దల సహకారంతో కోదాడ మండల పరిధిలోని ఫోరస్ ల్యాబ్ వారిని సంప్రదించి రూ.25లక్షలతో నిలిచిన పనులను ప్రారంభించారు. దీంతో మొదటి అంతస్తు నిర్మాణం వరకు పనులు దాదాపు పూర్తిచేశారు.

ఇప్పటికీ రూ.40లక్షలతో పనులు పూర్తి..

ఇప్పటి వరకు జెడ్పీటీసీ నుంచి రూ.10లక్షలు, ఫోరస్ ల్యాబ్ వారి నుంచి రూ.25లక్షలు, దాతల సహకారంతో రూ.5లక్షలు మొత్తం రూ.40లక్షలతో ప్రస్తుతం మొదటి అంతస్తు వరకు పనులు పూర్తి చేశారు. మిగిలిన పనులకు జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు జానిమియా తన నిధుల నుంచి రూ.2లక్షలు మంజూరు చేశారు. అదే విధంగా ఎంపీపీ బండ్ల ప్రశాంతికోటయ్య మండల పరిషత్ నిధులు రూ.5లక్షలు మంజూరు చేశారు. ప్రస్తుతం ఈ రూ.7లక్షల నిధులు అందుబాటులో ఉన్నాయి. ఈ నిధులు మంజూరు చేసి 5నెలలు కావస్తున్నా నేటి వరకు పనులు తిరిగి ప్రారంభించలేదు. ఈ నిధులతో పాటు గ్రంథాలయం అభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు గ్రామానికి చెందిన ఇతర ఉద్యోగుల నుంచి నిధులు సేకరించి పనులు చేశారు. ప్రస్తుతం ఉన్న నిధులతో పాటు ప్రభుత్వం నుంచి వచ్చే మరికొన్ని నిధులతో భవనం రెండో అంతస్తు నిర్మాణం చేయాల్సి ఉంది. కాని పాలకవర్గ సభ్యులు ఉన్న నిధులతోనైనా పనులు చేపట్టకుండా వదిలేశారు. ఈ విషయంపై తక్షణమే గ్రంథా లయం అభివృద్ధి కమిటీ సభ్యులు సమన్వయంతో సమావేశం ఏర్పాటు చేసి భవనం పూర్తి చేసి, విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని పలువురు గ్రామస్తులు, యువకులు, విద్యార్థులు కోరుతున్నారు.

పనులు త్వరితగతిన పూర్తిచేస్తాం



నూతన గ్రంథాలయ నిర్మాణ పనులు పలువురి దాతల సహకారంతో మొదటి అంతస్తు వరకు పూర్తయ్యింది. ప్రస్తుతం ప్రహరీ, రెండో అంతస్తు నిర్మాణానికి సరిపడా నిధులు లేవు, ప్రభుత్వం మరికొన్ని నిధులు మంజూరు చేస్తే పనులు త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తాం.

– అంబాల వెంకటి, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్

కుంగ్‌ఫూ, కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


విద్యార్థినులను అభినందిస్తున్న అధ్యాపకులు

కోదాడఅర్బన్ : పట్టణంలోని కిట్స్ మహిళా ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థినులు ఏపీలోని కృష్ణా జిల్లా నందిగామలో నిర్వహించిన 4వ జాతీయ కుంగ్‌ఫూ, కరాటే చాంపియన్ షిప్– 2023 పోటీల్లో పాల్గొని ఆదివారం బంగారు పథకాలు సాధించినట్లు కళాశాల చైర్మన్ నీలా సత్యనారాయణ తెలిపారు. కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థినులు ఎం.వైభవి, జి.మనోజ్ఞ కరాటే పోటీల్లో బంగారు పథకాలు సాధించినట్లు, అలాగే ద్వితీయ బహుమతుల్లో టి.భాను, ప్రసన్న, పి.రాణి వెండి పతకాలు సాధించినట్లు ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా విద్యార్థినులను చైర్మన్‌తో పాటు కళాశాల అకడమిక్ సలహాదారుడు పోతుగంటి నాగేశ్వరరావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గాంధీ, అకడమిక్ డైరెక్టర్ సీహెచ్ నాగార్జునరావు, అధ్యాపకులు తదితరులు అభినందించారు.

పేద ప్రజలకు అభయాస్తం అందించాలి

నేరేడుచర్ల : పేద ప్రజలకు తెలంగాణ ప్రభుత్వం తక్షణమే అభయాస్తం అందించాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన సంఘం మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం నియంతపాలన కొనసాగించి నిరుద్యోగ యువకులను తీవ్రఅన్యాయం చేసిందన్నారు. కాంగ్రెస్ అన్నీ వర్గాలకు సమన్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. సమావేశంలో శ్రీనివాస్, శ్రీను, బాలరాజు, నగేష్, రమేష్, ప్రకాశ్ తదితరులున్నారు.

విద్యార్థులకు ఉచిత బస్‌పాస్ ఇవ్వాలి


బైక్‌ర్యాలీని ప్రారంభిస్తున్న పీవైఎల్ నాయకులు

గరిడేపల్లి : విద్యార్థులందరికీ ఉచిత బస్‌పాస్ ఇవ్వాలని ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) జిల్లా ప్రధాన కార్యదర్శి రవి ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం మండల పరిధిలోని వెలిదండ గ్రామంలో ప్రగతిశీల యువజన సంఘం, ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అహంకారం, నియంతృత్వం తారస్థాయి చేరడం, విద్యార్థి, నిరుద్యోగుల, ప్రజల సమస్యలను గాలికి వదలడంతో తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారం కోల్పోయిందన్నారు. నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంలో విద్యార్థులందరికీ ఉచిత బస్‌పాస్‌లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న అన్ని రకాల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో పీవైఎల్ జిల్లా నాయకులు కామళ్ల సుందరయ్య, జిల్లా నాయకులు కారింగుల నాగరాజు, కామళ్ల బాలు, నరేష్, యశ్వంత్, చరణ్, అచ్యుత్, నరసింహారావు, శ్రీను, సురేష్, అజయ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.